క్లుప్తంగా

మరిడమ్మ జాతరకు పందిరి రాట



మరిడమ్మ జాతరకు పందిరి రాట వేస్తున్న ఈఓ తదితరులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట వేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల నడుమ పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఈఓ రామ్మోహనరావు మాట్లాడుతూ అమ్మవారి గరగ ఉత్సవాన్ని నిర్వహించారు. వచ్చే నెల 4 నుంచి అమ్మవారి జాతర ఉత్సవాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



భద్రరావుకు సపర్యలు చేస్తున్న సహచర కూలీలు

పెద్దాపురం: ఉపాధి పని చేస్తుండగా కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన శనివారం పెద్దాపురం మండలం గుడివాడలో చోటు చేసుకుంది. పెద్దాపురం ఏపీఓ బండే రాజుబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మావూళ్ల భద్రరావు (59) గ్రామంలో ఉపాధి పని చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో పొలం గట్టుపైనే ప్రాణాలు విడిచారన్నారు. భద్రరావుకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఏపీఓ రాజుబాబు ఘటనా స్థలానికి చేరుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఉపాధి పథకం ద్వారా వచ్చే పరిహారానికి సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. సర్పంచ్ కనపర్తి చీమదొర, బాబి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కాలుష్య కాసారం ఏలేరు కాలువ



కలుషిత జలాలతో నిండిన ఏలేరు కాలువ

సామర్లకోట: ఏలేరు కాలువ కాలుష్య జలాలతో నిండిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలేరు కాలువ నీటిపై ఆధారపడి సామర్లకోట మండల పరిధిలో 8 గ్రామాల రైతులు జీవిస్తున్నారని రైతులు సానా నారాయణరావు, ఉప్పు విష్ణు, చల్లాబత్తుల బుజ్జి, సీహెచ్ రాంబాబు, పి.మల్లేష్, బీరద వెంకన్న తెలిపారు. ఏలేరు కాలువ పెద్దాపురం పరిసరాల ప్రాంతాలకు చెందిన పరిశ్రమల కలుషిత వ్యర్థాలతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల తాము పంటలు పండించుకునే అవకాశం లేకపోవడమే కాకుండా పశువులకు తాగునీరు, సాగు నీరు లేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలేరు కాలువలోని కాలుష్య జలాలపై అధికారులు విచారణ చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి వివిధ మండలాల నుంచి భక్తులు కాలినడకను ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళ్లూరు మఠంలో అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహకారంతో అన్నదానం జరిపినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలిపారు. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భూసార పరీక్ష అన్నదాతకు రక్ష

- అధిక దిగుబడుల సాధనకు అవశ్యం
- నమూనాల సేకరణకూ పరిమితులు
- రసాయన ఎరువులతో సారానికి చేటు
- మండలంలో 10,154 ఎకరాల్లో సాగు



మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు

కొత్తపల్లి: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. సాగుభూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. అలాగే ఏ ఎరువులు అనవసర వ్యయం, గణ నీయంగా తగ్గుతుంది. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో అన్నదాతలు రసాయన ఎరువు, పురుగు మందులు, అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో జాగ్రత్తలు

పంటకోత పూర్తయిన తర్వాత, వేసవి పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకుడదు. ముందుగా నేలపైన ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసి వేయాలి. వరి పొలంలో 'వి' ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పై పార నుంచి కింద వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో 'జెడ్' ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు సర్వే నంబర్ విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపుతారు. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాలు లోతు నుంచి నమునా సేకరించాలి. మండలంలో మొత్తం సుమరు 6,150 వేలకు పైగా రైతులు సుమరు 10,154 ఎకరాల్లో ఖరీఫ్‌లో రైతులు సాగు చే స్తున్నారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

పరీక్షలతో పోషకాల స్థితిపై అంచనా



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి అవసరమైన ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. మండలంలో ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం పరిధిలో 40 నమూనాలు సేకరిండం జరుగుతుంది. వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలి. మండంలో సుమారు 700 పరీక్షలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం.

– వి.జోగిరాజు, ఎంఏఓ, కొత్తపల్లి

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య అన్నారు. బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి బాలిక చదువు కోవాలని, బడి బయట పిల్లలు లేకుండా ఉండే విధంగా జూలై 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 పి పుల్లయ్య, హెచ్‌ఎం మీనామాధురి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



ఉత్తమ విద్యార్థులను అభినందించిన ఎంఈఓ–2 పుల్లయ్య

సామర్లకోట: బాలికా విద్యను ప్రోత్సహించడం ద్వారా కుటుంబ ప్రగతితో పాటు సమాజ ప్రగతి సాధ్యమవుతుందని మండల విద్యాశాఖాధికారి–2 పి పుల్లయ్య అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 'నే బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం పోషణ్, స్టూడెంట్స్ కిట్లతో అనేక సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను వినూత్నంగా అమలు చే స్తున్న సాయి రామకృష్ణను పుల్లయ్య అభినందించారు. 10వ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన పి.హరిణి పాటు పాటు, కె.దివ్యశ్రీశాంతి, వి.మీనాక్షిలను ఆయన అభినందించి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. సాయిరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా నెల రోజుల పాటు 'నే బడికి పోతా' అనే కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులను సత్కరించడం ద్వారా బాలికా విద్య ప్రోత్సహించడం అనే కాన్సెప్ట్ లభించిందన్నారు. తమ పాఠశాల పీఎంశ్రీ పాఠశాలగాను, సీబీఎస్ఈ పాఠశాల గాను గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, జి. గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, తాళ్లూరి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కవులకు ఆదర్శం శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

పెద్దాపురం: కాదేదీ కవితకనర్హమంటూ ఎందరో కవులకు ఆదర్శప్రాయంగా నిలచి కవులను తయారు చేసిన కర్మాగారం ప్రముఖ రచయిత శ్రీశ్రీ అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి శనివారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ నిరంతరం కష్టజీవులకు ఇరువైపులా కాపు కాసేవాడే కవి అని నిరూపించిన వ్యక్తి శ్రీశ్రీ అన్నారు. సమాజానికి ఆయన అందించిన రచనలు ఎనలేనివని శ్రీశ్రీ సేవలను కొనియాడారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు శ్రీనివాస్, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కె.శివ, కవులు, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

సాంకేతికతపై యువత దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



యర్రవరంలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఏలేశ్వరం: యువత సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని యర్రవరంలో శనివారం ఆయన సైంటిఫిక్ ప్రోగ్రాం అండ్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీపై స్పార్క్ సంస్థ సేవలు ప్రశంసనీమయన్నారు. అనంతరం స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై సతీష్, డీఆర్‌డీఓ సైంటిస్టు విక్రాంత్, స్పార్క్ సభ్యులు రవి కిరణ్, అదిత్య, సాహల్, తదితరులు పాల్గొన్నారు.

రాక్ సిరామిక్‌లో కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ పరిశ్రమలో పని చేస్తున్న రెగ్యులర్ కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపడం దారుణమని, పనులకు ఆపిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ కాకినాడ నగరశాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నాయకులు మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు శనివారం సుందరయ్యభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. రాక్ సిరామిక్ యాజమాన్యం కార్మికులను అక్రమంగా నిలిపివేస్తోందని, ఇది ఎంత మాత్రం సహించబోమన్నారు. నష్టాలు వస్తున్నాయన్న సాకు చూపిస్తూ 20 ఏళ్ల నుంచి పని చేస్తున్న 25 వేల మంది రెగ్యులర్ కార్మికులను పనులకు రావొద్దని గేటు వద్ద నిలిపివేయడం దారుణమన్నారు. తక్షణమే యాజమాన్యం నిలిపివేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. రాక్ సిరామిక్ యాజమాన్యం చేస్తున్న తప్పుడు ధోరణులను జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గమనించి ఈ విషయంలో వెంటనే కలుగజేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలి



మైక్రో లెర్నింగ్ సెంటర్‌పై అవగాహన కల్పిస్తున్న ఆప్కాబ్ రిటైర్డు జనరల్ మేనేజర్ మస్తాన్‌రావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి, పంటలు చేతికి వచ్చిన తర్వాత వసూలు చేసుకోవాలని ఆప్కాబ్ విశ్రాంత జనరల్ మేనేజర్ మస్తాన్‌రావు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో శనివారం మైక్రో లెర్నింగ్ సెంటర్‌పై జిల్లాలోని సహకార సంఘ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సహకార సంఘాలకు చెందిన సిబ్బంది మమేకం కావాలన్నారు. డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ రుణాలు సకాలంలో చెల్లిస్తే వారికి వచ్చే లబ్ధిని సంఘాలు సిబ్బంది తెలియజేయాలన్నారు. సహకార సంఘాలు రికార్డులు ఏ విధంగా తయారుచేయాలి, సంఘాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, సిబ్బంది రైతులకు ఎలా ఉండాలి తదితర విషయాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జీఎం ప్రకాష్ పాల్గొన్నారు.

చిన్నారులూ.. అంగన్‌వాడీ పిలుస్తోంది..



చిన్నారులకు అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

కొత్తపల్లి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పిఠాపురం ప్రాజెక్టు సీడీపీవో దుర్గాదేవి అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులతో కేంద్రం ద్వారా అందే సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకునేందుకు తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలపై ప్రచారం



ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: స్థానిక అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలపై శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక ఏలేరునది ఒడ్డున వేంచేసిన స్వామి వారి ఆలయంలో ఈ నెల 17న స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యంలో స్వామివారి కల్యాణోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యులు, నరసింహచార్యులు, మలిరెడ్డి సముద్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

వేధింపులు ఉంటే ఫిర్యాదు చేయండి



ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేస్తున్న వయోవృద్ధులు

కాకినాడ సిటీ: వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని శనివారం కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సహకారశాఖ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు బళ్లమూడి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నేటి సమాజంలో వృద్ధులు అనేక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, పిల్లలు, బంధువుల వల్ల వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వయోవృద్ధులు ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు వి.నారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, పోలీసు ఉన్నతాధికారులు మానవతా దృష్టితో వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నియోజకవర్గాల వారీగా మండలాలు, గ్రామాల వారీగా కమిటీల ఏర్పాటు ఆవశ్యకతను, అవసరాలు, సమస్యలు పరిష్కరించడానికి వీలుపడే అంశాలను వివరించారు. సమావేశం అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బీఎస్ఎన్ మూర్తి, అసోసియేట్ అధ్యక్షులుగా విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కె.గౌరీనాయుడు, వి.శివాజీగణేష్, జనరల్ సెక్రటరీగా ఆర్ఎస్ సుధాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జెఎస్‌వీ ప్రసాద్, అమ్మాజీ, ట్రెజరర్‌గా వి.రామసుబ్బారావు, కార్యదర్శులుగా ఎంవీ గోపాలరావు, ఎం.భాస్కరరావు తదితరులతో పాటు 13 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు రోటరీ క్లబ్‌లో నివసిస్తున్న వృద్ధులకు పండ్లు, రొట్టెలు, సబ్బులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.

పొలాలకు గోదారి పరుగులు

- ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం
- బోర్లపై ఆధారపడిన పొలాల్లో ఇప్పటికే ప్రారంభం
- చుక్క నీరు కూడా నష్టపోకుండా అధికారుల చర్యలు
- ప్రవాహ వేగాన్ని తగ్గిస్తున్న గుర్రపు డెక్క
- ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న రుతు పవనాలు



గోదావరి కాలువ నుంచి పంట కాలువలకు వెళ్తున్న నీరు

సామర్లకోట: గోదావరి కాలువకు నీరు విడుదలైంది. దాంతో రైతులు, మున్సిపల్ అధికారులు గోదావరి నీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు ఉన్న గోదావరి కాలువలో నీరు పట్టణ, మండల పరిధిలోని సుమారు 18,500 ఎకరాలకు, పెద్దాపురం మండల పరిధిలో మూడు వేల ఎకరాలకు అందుతుంది. దీనిలో భాగంగా కాపవరం ఎత్తిపోతల పథకం కింద 600, బిక్కవోలు లింగాల ఎత్తిపోతల పథకం కింద 500, పీబీ దేవం–1 ఎత్తిపోతల పథకం కింద 1,100, ఇల్లపల్లి ఎత్తిపోతల పథకం కింద 750, జి.మేడపాడు ఎత్తిపోతల పథకం కింద 1200, వేట్లపాలెం ఎత్తిపోతల పథకంలో 1200 ఎకరాలు సాగు అవుతున్నాయి. గోదావరి కాలువకు నీరు రావడంతో ఆయా ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బోర్లపై ఆధారపడి ఉన్న రైతులు వరి సాగు ప్రారంభించారు. సామర్లకోట, పీబీ దేవం, వేట్లపాలెం, జి. మేడపాడు, జి.కొత్తూరు, హుస్సేన్‌పురం, ఉండూరు, అచ్చంపేట, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల రైతులు గోదావరి కాలువను, చంద్రంపాలెం, గొంచాల, నవర గ్రామ ప్రజలు పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు కాలువ నీటిని సాగునీటిగా ఉపయోగిస్తారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలో 22,500 ఎకరాల వరి సాగవుతోందని మండల వ్యవసాయాధికారులు చెప్తున్నారు. గోదావరి కాలువకు నీరు వచ్చినా రైతులకు మేలు జరిగే అవకాశం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. గోదావరి కాలువ నీటితో పాటు గుర్రపు డెక్క కొట్టుకు వస్తోందని దీని వల్ల ప్రవాహ వేగం తగ్గి నిర్దేశిత ఎకరాలకు నీరు అందదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి సిద్ధం..

గోదావరి కాలువలో నీటిని సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలో తాగునీటిగా ఉపయోగిస్తారు. ఈ మేరకు గోదావరి జలాలు విడుదల కావడంతో వ్యర్థ జలాలు సముద్రంలోనికి పోయిన తరువాత స్వచ్ఛమైన నీటిని తాగునీరుగా ఉపయోగించేలా మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. సామర్లకోట ఫిల్టర్ చెరువు ఆకు పచ్చరంగులో ఉంది. దాంతో గోదావరి జలాలు నేరుగా ఫిల్టరుబెడ్‌లోనికి పంపి శుద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. చెరువులో నీటిని పూర్తిగా తీసి వేసి పూడిక తీయిస్తామని తెలిపారు.

జాడ లేని రుతు పవనాలు

గత 15 రోజులుగా రుతు పవనాలు వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటిస్తున్నా ఇప్పటి వరకు వర్షాలు రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గోదావరి కాలువ నీటితో పాటు వర్షపు నీరు తోడైతే చేలకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హానికర కోనోకార్పస్, ఏడాకుల చెట్లు తొలగించాలి

బోట్‌క్లబ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోనోకార్పస్, ఏడాకుల చెట్లు తొలగించి, వేపమొక్కలు నాటించాలని పర్యావరణశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు కాకినాడ పౌరసంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి రిజిస్టర్డ్ పోస్టు చేసినట్లు చెప్పారు. పక్షులు గూళ్లు పెట్టని ఈ మొక్కల ఆకులను ఆవులు, గేదెలు, మేకలు కూడా తినవన్నారు. ఆక్సిజన్ తీసుకుని కార్బన్ డై ఆక్సైడ్ విడుదల చేసే వీటి పుప్పొడి గాలిలో కలిసి శ్వాసనాళాల్లోకి చేరి ఉబ్బసం శ్వాస కోశ వ్యాధులు, కంటి జబ్బులు, చర్మ వ్యాధులు, దద్దుర్లు కలిగిస్తాయన్నారు. వాస్తవాలను పరిశీలించి ఆ చెట్లను తొలగించి వాటి స్థానంలో వేప మొక్కలు నాటాలన్నారు.